క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

కడియం: స్థానిక బస్టాండ్ సమీపంలోని మద్వి రాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

నాణ్యమైన నిత్యావసరాలు అందించాలి

సీటీఆర్ఐ: ప్రజలకు నాణ్యమైన నిత్యావసరాలు అందించాలని అర్బన్ తహసీల్దార్ సుస్వాగతం అన్నారు. ఆయన గురువారం తన కార్యాలయంలో నగరంలోని ఎండీయూ, రైస్ డీలర్లతో సమీక్ష నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే రేషన్ అందించాలనే ఉద్దేశంతో ఎండీయూ ఆపరేటర్లను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పవన్, ఎంఎస్‌ఓలు అచ్యుతాకుమారి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రధాని చిత్రం ఏర్పాటు చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: రేషన్ వాహనాలపై ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కందికొండ రమేష్ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని అందజేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ప్రధాని చిత్రపటాన్ని ఏర్పాటు చేయని పక్షంలో డిసెంబర్ మూడు నుంచి ప్రతి రేషన్ షాపు వద్దకు వెళ్లి నరేంద్ర మోదీ ఫొటోలు అతికించే కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు.

మద్యం విక్రేత అరెస్టు


నిందితుడితో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ రమణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం సీతంపేట ప్రాంతంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మెరకవీధికి చెందిన నీలపు సత్యనారాయణను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్ సీఐ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ బ్యాంకుల్లో ఉద్యోగాలను భర్తీ చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వ బ్యాంకుల్లో తక్షణమే ఉద్యోగ నియమకాలు చేపట్టాలంటూ బ్యాంక్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు గురువారం నగరంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ముందు ధర్నా చేశారు. యూనియన్ నాయకుడు లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయకపోవడంతో మిగిలిన ఉద్యోగులపై పనిభారం పెరిగి ఒత్తిడి లోనవుతున్నారన్నారు. బ్యాంక్‌లో గుమస్తాలను, సబ్ స్టాఫ్ ఉద్యోగాలను తగ్గించడం వల్ల ఖాతాదారులకు సరైన సేవలు అందడం లేదన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయని పక్షంలో డిసెంబర్, జనవరిలో దేశ వ్యాప్తంగా సమ్మె చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కామేశ్వరరావు, సోమరాజు, మురళి, రాంబాబు, శివరామకృష్ణ, వెంకటేశ్వరరావు, కిషోర్, కీర్తన పాల్గొన్నారు.

నగరానికి బాలరాముని కలశాలు


కలశాలతో ఊరేగింపుగా వస్తున్న ట్రస్టు సభ్యులు

సీటీఆర్ఐ: శ్రీరామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలరాముని పవిత్ర పుణ్యక్షింతల కలశాలను అయోధ్య నగరం నుంచి గురువారం ఊరేగింపుగా ఇస్కాన్ ఆలయానికి తీసుకువచ్చారు. భక్తుల సందర్శనార్థం ఇస్కాన్‌లో ఈనెల 25 వరకూ వీటిని ఉంచుతారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జనవరి 22వ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌పై సమావేశం

కంబాలచెరువు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత గురువారం జిల్లా బార్ అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అదనపు జిల్లా న్యాయస్థానాలలో మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులను పరిష్కరించి బాధితులకు పరిహారం అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. వీటితో పాటు భూ వివాదాలు, ఆస్తి వివాదాలు, రెవెన్యూ, మున్సిపాలిటీ కేసులు, రాజీ పడదగిన అన్ని ఇతర కేసులను పరిష్కరించేందుకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె. ప్రత్యూష కుమారి పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


కడియంలో వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చందన నాగేశ్వర్


వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక సచివాలయం -1లో గురువారం ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రజల కోసం అనునిత్యం తపించే నిజమైన నేత వైఎస్ జగన్ అన్నారు. ప్రతి సచివాలయం వద్ద చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, లబ్ధిదారుల వివరాలను ప్రదర్శిస్తున్నారన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయం ఆవరణలోని వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, శాక పట్టాభి, ఎండీ సర్కార్ బాషా, తిరుమలశెట్టి శ్రీను, పున్నంరాజు వీర్రాజు పాల్గొన్నారు.

జగన్ పాలన ఆదర్శం : డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: సచివాలయాలు కేంద్రంగా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్.. దేశానికే ఆదర్శంగా నిలిచారని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని బత్తిన నగర్, కంబాలపేట, సిగిడిలపేట, లలితా నగర్ సచివాలయాల్లో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఉన్న ఆదాయ వనరులే ఈ ప్రభుత్వంలో కూడా ఉన్నాయన్నారు. కానీ అప్పుడు లేని అభివృద్ధి, సంక్షేమం జగనన్న ప్రభుత్వంలో ఏ విధంగా అందిస్తున్నారనే విషయాన్ని విజ్ఞులైన ప్రజలు గుర్తించాలన్నారు. 80 శాతం ప్రజలకు సంక్షేమాన్ని అందించిన ఘనత జగనన్నదేనన్నారు. నాలుగు సచివాలయాల్లో సుమారు రూ.75 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వాటి వివరాలను ఆయా సచివాలయాల వారీగా బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు మజ్జి అప్పారావు, అజ్జరపు వాసు, మానే దొరబాబు, ముప్పన ప్రభాకర్ చౌదరి, పెంకే సురేష్, బర్రే కొండబాబు, అరిగెల బాబు, బాలాజీ రెడ్డి, పోలు విజయలక్ష్మి, కొత్త విజయరాజ్యలక్ష్మి, బిల్డర్ చిన్న, ఏవీ రమణ పాల్గొన్నారు.


బొమ్మూరులో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న తాటికొండ విష్ణు, పార్టీ నేతలు

జగన్ పాలన రాష్ట్రానికి అవసరం

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న సుపరిపాలన రాష్ట్రానికి ఎంతో అవసరమని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. బొమ్మూరు సచివాలయం-1 పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తాటికొండ విష్ణుమూర్తి, నోడల్ ఆఫీసర్ తాడి కృష్ణ అభివృద్ధి, సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌లను విడుదల చేశారు. తాటికొండ విష్ణు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా ప్రజలకు రూ.19.88 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు యెనుముల త్యాగరాజు, సచివాలయ కన్వీనర్లు సద్గుణ రామారెడ్డి, తోడేటి రాహుల్, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, మాజీ ఉపసర్పంచ్ దాకే శ్రీను, స్కూలు కమిటీ చైర్మన్ కాకులపాటి కుమార్, ఇతర సచివాలయ కన్వీనర్లు కేవీ సుబ్బారెడ్డి, పీవీ రమణ, రమేష్, తోడేటి రాజా, బందిల మణి, దండా అప్పలకొండ, పరిమళ బాబీ పాల్గొన్నారు.

రూ.20 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర అన్నారు. స్థానిక 17వ డివిజన్ శంభూనగర్ 43వ వార్డు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మింది నాగేంద్ర, డివిజన్‌ల జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పినీడి ప్రసాద్‌బాబు (రాజమౌళి) ముఖ్య అతిథులుగా పాల్గొని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. మింది నాగేంద్ర మాట్లాడుతూ 43వ వార్డు సచివాలయం పరిధిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం రూ.20 కోట్లు ఖర్చుచేసిందన్నారు. అనంతరం శంభూనగర్‌లో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో 17వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు చీకురుమిల్లి చిన్న, రొంపిచర్ల రమేష్, సచివాలయం కన్వీనర్లు గండి శ్యామ్, గణేష్, జువ్వల నాగిరెడ్డి, దోనిపాటి రాజేష్, నేతల రామచంద్రరావు, బుల్లెట్, పండు, డివిజన్ల నాయకులు దుంపా చంద్రారెడ్డి, అంగాడ సత్యప్రియ, అన్నపూర్ణరాజు, షేక్ ఇమామ్ (బాబ్జీ), పడమట నాగమణి, దమ్ము ప్రసాద్, పడమటి కామరాజు పాల్గొన్నారు.


శంభూనగర్‌లో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న మింది నాగేంద్ర

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

ధవళేశ్వరం: గ్రామంలోని రామపాదాల రేవును గురువారం వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పరిశీలించారు. రేవులోని భక్తులు స్నానాలు చేసేందుకు ఇబ్బందులు లేకుండా ఇసుకను వేయాలని పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబును ఆదేశించారు. విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని, కార్తిక మాసం సందర్భంగా భక్తుల తాకిడి అధికంగా ఉండనున్న నేపథ్యంలో రేవు వద్ద పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీలో నూతన డ్రైనేజీల నిర్మాణంపై స్థానిక నాయకులు, అధికారులతో చర్చించారు. పితృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు నంబూరి రవిని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, చొల్లంగి సత్యగిరి, గోలి దేవకుమార్, పేర్ల దుర్గాప్రసాద్, పందెళ్ల భానుప్రసాద్, శ్రీరంగం బాలరాజు, ముత్యాల జాన్, మహిళా నాయకులు పట్టపగలు వెంకటలక్ష్మి, దేవులపల్లి సరితరాణి, పెన్నాడ లక్ష్మి, చప్పిడి జ్యోతి, కల్యాణి రెడ్డి, పసుపులేటి దేవి పాల్గొన్నారు.


ధవళేశ్వరంలో రామపాదాల రేవును పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ప్రతి సమస్యకూ పరిష్కారం

కడియం: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు తెలిపిన ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతున్నామని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని మురమండలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ అయినవిల్లి రుక్మిణీ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మంగ గంగరాజు జరిగిన ఈ కార్యక్రమంలో చందన నాగేశ్వర్ ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దీనదయాళ్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు యర్రా సూర్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు పల్లి ప్రసాద్, పైడిమళ్ల శాంతకుమారి, కొప్పాక రమణ, బిల్లకుర్తి గంగాజలం, యండమూరి ముత్యాలరావు, తులూరి సుబ్బారావు, బీరక సత్యనారాయణ, బులగూరి గోవిందరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వేమగిరిలో విస్తృత పర్యటన

కడియం మండలం వేమగిరిలో చందన నాగేశ్వర్ విస్తృతంగా పర్యటించారు. వేమగిరిలోని జగనన్న లేఅవుట్‌ను సందర్శించారు. స్థానికంగా సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులు తక్షణం కల్పించాలన్నారు. వేమగిరి పంప్‌హౌస్ పక్కన ఆటోస్టాండ్‌కు స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షులు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, పార్టీ నాయకులు వెలుగుబంటి వెంకటాచలం, బడుగు ప్రశాంత్ కుమార్, కట్టా సత్యసురేష్, విప్పర్తి ఫణికుమార్, రామకృష్ణ, క్రాంతిప్రకాష్, అల్లంపల్లి శ్రీను, జాను, యూనియన్ నాయకులు యనమదల చంటిబాబు, సుబ్బారావు, కోటి ఉన్నారు.

ఆర్థిక సాయం

కడియపులంక చర్చివీధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పల్లి కుమారికి చందన నాగేశ్వర్ ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, చీకట్ల మాచరయ్య, బోడపాటి సత్తిరాజు పాల్గొన్నారు.

పార్కులో సమస్యల పరిష్కారానికి కృషి

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని అరవింద్ నగర్ పార్కు సమస్యలను పరిష్కరిస్తానని ఏపీగ్రీనింగ్‌అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ హామీ ఇచ్చారు. ఆయన గురువారం అరవింద్ నగర్ పార్కును ఆ ప్రాంత అసోసియేషన్ నాయకులు, పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. పార్కులో వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకోవడానికి మైదానం తదితర సమస్యలపై సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులతో మాట్లాడి, అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రతిరోజూ సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ పిల్లా లక్ష్మణరావు, సచివాలయ కన్వీనర్లు పడాల వీరరాఘవరెడ్డి, సిరసపల్లి శంకరరావు, మాజీ కార్పొరేటర్ మంచాల బాబ్జీ, పాశర్లపూడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


అరవింద్ నగర్ పార్కును పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మంచి పుస్తకాలు మన జీవన ప్రమాణాలను పెంచుతాయని సీసీసీ చానల్ ఎండీ, వైఎస్సార్ సీపీ నాయకుడు పంతం కొండలరావు అన్నారు. స్థానిక ఇన్నీసుపేటశాఖా గ్రంథాలయంలో గురువారం కర్ణాటక మ్యూజిక్ టీచర్ కారుమూరి వీర రత్నకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన సభలో పంతం కొండలరావు, వైఎస్సార్ సీపీ కార్యదర్శి దూలం వెంకన్న బాబు, రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు చలుమూరి సత్యనారాయణ తదితరులు గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో మారిశెట్టి సత్యనారాయణ, పిచ్చుక రాంబాబు, బొడ్డు శ్రీనివాసరావు, సీతాపతి, వీధి లక్ష్మయ్య, లైబ్రేరియన్ శ్రీదేవి పాల్గొన్నారు.


ఇన్నీసుపేటశాఖా గ్రంథాలయంలో మాట్లాడుతున్న కొండలరావు

- స్థానిక ఆల్కాట్‌తోట శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయిని లక్ష్మి, గ్రంథాలయాభివృద్ధి కమిటీ సభ్యుడు వి.రామకృష్ణారావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని లైబ్రేరియన్ కొత్తపల్లి రమ్యశ్రీ తెలిపారు.

దువ్వూరి సుబ్బమ్మ పురస్కారాల ప్రదానం


పురస్కార గ్రహీతలతో జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: ఎందరో మహానుభావుల బలిదానంతో దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. దువ్వూరి సుబ్బమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సరస్వతీ ఘాట్ వేదికపై దువ్వూరి సుబ్బమ్మ జయంతి ఘనంగా నిర్వహించారు. మరో ముఖ్య అతిథి, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డాక్టర్ చప్పిడి కృష్ణ మాట్లాడుతూ సుబ్బమ్మ చూపిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. సభకు అధ్యక్షత వహించిన సేవా సమితి అధ్యక్షురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధుల త్యాగాలను విస్మరించరాదన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవ చేసిన 27 మంది మహిళలకు దువ్వూరి సుబ్బమ్మ సేవా పురస్కారాలు అందించారు. సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్ ఆచార్య తెన్నేటి హైమావతికి జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో తోట సుబ్బారావు, చిలుకూరు శ్రీనివాస్, డాక్టర్ పీవీబీ సంజీవరావు, వంశీకృష్ణ, నీలకంటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా తత్త్వశాస్త్ర దినోత్సవం

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువారం ప్రపంచ తత్త్వశాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యునెస్కో ప్రారంభించిన ఈ దినోత్సవాన్ని ప్రతి ఏటా నవంబర్ మూడో వారంలో జరుపుకొంటున్నట్టు ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. విజయ పథంలో తత్వచింతన అనే అంశంపై అవధాని తాతా సందీప్ శర్మ ప్రసంగించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీశైల శాస్త్రి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే ఆయుధం

- అర్హులందరూ ఆ హక్కు పొందాలి
- కమిషనర్ దినేష్ కుమార్



రాజమహేంద్రవరం సిటీ: ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని, అర్హులందరూ ఆ హక్కు పొందాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ పిలుపునిచ్చారు. గురువారం జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఓటర్ నమోదు స్వీప్‌పై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు పయనించేలా ఓటర్లను చైతన్య పరచడం, భాగస్వామ్యం చేయడమే స్వీప్ ముఖ్యఉద్దేశమన్నారు. మీడియా ద్వారా యువతకు ఓటు నమోదుపై విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో 2,56,000 వేలకు పైగా ఓటర్లు ఉన్నారన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా సుమారు 60 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రతి బూత్‌స్థాయి బీఎల్‌వో వద్ద నమోదు ఫారాలు సంబంధిత మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం ఉందన్నారు. డిసెంబర్ 9 వరకూ స్వీప్ అవగాహన కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ హెల్త్ అధికారి డాక్టర్ వి.వినూత్న, తహశీల్దార్ సుస్వాగతం పాల్గొన్నారు.

పీఏను కొట్టారంటూ గోరంట్ల ఆందోళన


కంబాలచెరువు: తన పీఏను ట్రాఫిక్ కానిస్టేబుల్ కొట్టాడంటూ రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన నాయకులు గురువారం రాత్రి ఆందోళన చేశారు. దీనికి సంబంధించిన వచ్చిన సమాచారం మేరకు...గోరంట్ల బుచ్చయ్యచౌదరి పీఏ జి.చంద్రశేఖర్ స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని రామాలయం సెంటర్ మీదుగా వెళ్తున్నాడు. ఆ సమయంలో ట్రాఫిక్ సిగ్నల్ పడింది. దీంతో ఆ ప్రాంతంలో డ్యూటీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కరుణ కుమార్.. చంద్రశేఖర్ వాహనాన్ని ఆపి ఫొటో తీశాడు. దీంతో ఆగ్రహం చెందిన చంద్ర శేఖర్ 'నేను ఎవరో తెలుసా.. ఫొటో ఎందుకు తీశావు' అంటూ ట్రాఫిక్ కానిస్టేబుల్ చేతిలో సెల్‌ఫోన్ తీసుకుని నేలకేసి కొట్టాడు. దీంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ చేతిలోని వాకీటాకీతో కొట్టినట్లు సమాచారం. విషయం తెలిసిన గోరంట్ల బుచ్చయ్య చౌదరి, టీడీపీ, జనసేన నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేశారు. అక్కడకు చేరుకున్న ప్రకాశం నగర్ పోలీసులు జరిగిన సంఘటపై విచారించి కేసు నమోదు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల కోసం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ హౌసింగ్ బోర్డు ఫీడర్‌లోని హౌసింగ్ బోర్డు ఏరియాలో అంతరాయం కలుగుతుందన్నారు. లాలచెరువు సబ్ స్టేషన్‌లో పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్య కియా షోరూం ఏరియా, ఎఫ్‌సీఐ గోడౌన్స్, సత్తెమ్మ తల్లి గుడి, మసీద్ రోడ్డు, వెంకట రామయ్య నగర్, నారాయణపురం, గోపాల్ నగర్ పుంత, సైకిల్ కాలనీ, సుబ్బారావు పేట, ఆర్‌టీఓ ఆఫీస్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ స్వరూపా నగర్, తారక రామ నగర్, పోలీస్ క్వార్టర్స్ బ్యాక్ సైడ్, శ్రీరాంపురం రోడ్డు, పిడింగొయ్యి, కవలగొయ్యి, విద్యుత్ కాలనీ, బర్మా కాలనీ, ఏవీ అప్పారావు రోడ్డు, గెయిల్ ఆఫీస్, శారదా నగర్ ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కంభం వారి సత్రం, వంకాయలవారి వీధి, మెయిన్ రోడ్డు, ఉల్లితోట వీధి, టౌన్ హాల్ రోడ్డు, మెరక వీధి, టి.నగర్, అజ్జరపువారి వీధి, బారువారి వీధి, వైగ్రామ్ రోడ్డు, చల్లపల్లివారి వీధి, న్యాపతివారి వీధి, కొత్తపేట, మంగళవారపు పేట, భారత్ బొమ్మలు రోడ్, ట్రైనింగ్ కాలేజీ, నాగులు చెరువు బజార్, కొబ్బరికాయల మార్కెట్, నెహ్రూ జంక్షన్, నేతాజీ స్కూల్ సెంటర్, భావనా ఋషి గుడి, ఇసుక వీధి, నాళం భీమరాజు వీధి, రంగ్రీజు పేట, చంద సత్రం, గుండువారి వీధి, సదనం, గోదావరి బండ్, వంకాయలవారి వీధి, పుష్కర ఘాట్ , జాంపేట, మదన్‌పేట, లక్ష్మీవారపుపేట, చర్చిపేట, మేదరపేట, సోమలమ్మ గుడి మొదలగు ఏరియాల్లో ప్రభావం ఉంటుంది.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థినులను అభినందిస్తున్న డీఈవో అబ్రహం

రాజమహేంద్రవరం రూరల్: క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో బాస్కెట్‌బాల్ అండర్-14 రాష్ట్రజట్టుకు ఎంపికైన రాజవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎస్.ఉమా సత్యశ్రీ, వి.నళిని, ఇతర సభ్యులను అభినందించారు. ఇటీవల చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన స్కూల్‌గేమ్‌ఫెడరేషన్ ఆఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ప్రతిభ చాటారు. విద్యార్థినులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన అండర్ -14 బాస్కెట్‌బాల్ గరల్స్‌జట్టు కోచ్, రాజవోలు జెడ్పీహెచ్ఎస్ పీడీ వై.సునీతకుమారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.సుధాకర్ బాబు, ఉపాధ్యాయులు సుదర్శన్, డేవిడ్ పాల్గొన్నారు.